# బూరగ పండు

ఈపాటికి కౌంటింగ్ ఐపోయి ఉంటుంది. బహుశా ప్రెసిడెంటు ఎన్నిక కూడా పూర్తయిపోయే వుంటుంది అన్నాడు కృష్ణ.

ఉదయంనుండీ ప్రయాణంలోనే ఉన్నందున కొంత అలసటగానే ఉంది. ఐనా బసప్ప ఎన్నిక ఫలితాలు తెలుసుకోనిదే యింటికి పోగూడదని కృష్ణ పట్టు.

కృష్ణ అట్లా గట్టిగా కూచోవడం చేత సరేననక తప్పలేదు. పైగా బసప్పతో నాకు ముప్పై సంవత్సరాల పరిచయం వుంది.

ఆ ఊళ్ళో కపిల బావుల లోతు పది మెట్ల నుండి పదేను వరకూ వుంటుంది. కొండల్లాంటి కోడెలైనా ఏడాదికంతా ఎముకల గూళ్ళై చర్మాల విలువకూడా గిట్టుబాటుకాని విషాద పరిస్థితిలో బసప్ప కాలికి బలపం కట్టుకొని ఎలెక్ట్రిసిటి ఉద్యోగుల వద్దకు తిరిగి తీగెల్ని ప్రాకించాడు. ఇప్పుడా బావులకంతా మోటార్లే. మీటనొక్కితే చాలు! పాతాళగంగ పైకివస్తున్నది. అసలు విషయానికివస్తే బసప్ప ఒక్కడే ఆ పది గ్రామాలకు పాత రాజకీయవేత్త.

నాకు ఎంతో బాగా గుర్తుంది. నలభై రెండు ఆగస్టులో బాపూజీతో నాయకులంతా బంధించినపుడు ఆ ఊళ్లో చిన్న మీటింగు పెట్టాలంటే ఒక్కడైనా ముందుకు రాలేదు. బసప్ప తెగించి అప్పటికప్పుడే ఒక కూసాన్నిపాతి పెట్రమేక్సు లైటును వెలిగించి ఆ కూసానికి తగిలించాడు. తన యింటి నుండి సులకమంచాన్ని తెచ్చి అక్కడవేసి కూచోమన్నాడు.

" ఆగునా జీవాలు
సాగునా లోకాలు
రాజుగా మనమెంచి
రైతు జూడకపోతే
దేశాలు తలలెత్తునా
దాస్యపు పాశాలు తా వీడునా "

అనే పాట పాడినపుడు ఒక్కొక్కరే వచ్చి కూచున్నారు.

ఆనాటి నుండీ బసప్పతో నాకు పరిచయం వుంది. ఊరు చిన్నదైనా పేరు పెద్దది. పోస్టాఫీసు నుండి సొసైటీల వరకూ, విద్యాలయం నుండి, గ్రంథాలయం వరకూ గ్రామీణ ప్రజానీకానికి ఈ ప్రభుత్వం ద్వారా ఎన్ని వసతులనైతే సమకూర్చడానికి వీలుందో అన్నీ సాధించినట్లే లెక్క.

అన్నిటినీ ఒక్క బసప్పే సాధించాడని ఖచ్చితంగా చెప్పలేక పోయినా అతనిది ప్రదానమైనపాత్ర అనిమాత్రం అంగీకరించక తప్పదు.

అత్యంత ముఖ్యమైనదీ, చెప్పుకో తగిందీ హరిజనవాడకు ఉచితంగా యిల్లు కట్టించడంతోపాటు వారికి బంజరు భూముల్నికూడా యిప్పించడం.

ఇవన్నీకూడా ఒక్కొక్కటే గుర్తుకు వచ్చింది నాకు.

వేరెళ్ళ వాగు దగ్గర జీపు ఆగి పోయింది. బహుశా అది ఉదయం నుండి చెడతిరగడంతో మొండికి వేసిందనిపించింది. అప్పుడప్పుడే ప్రొద్దు పోతున్నది. పశ్చిమ దిక్కులో కన్పించే మల్లెల కొండ బంగారు పూతతో కనకాచలమై కళ్ళకు మిరుమిట్లు గొలుపుతూ ఏదో కొత్త లోకంలో ఉన్నట్లు అన్పిస్తున్నది. వేరెళ్ళ వాగులో మొగిలిపొద లెక్కువ. ఆ ఇసుక తిన్నెల మీద క్షణకాలం విశ్రమించాలనిపించింది.

డ్రైవర్ చెప్పనే చెప్పాడు. ఇంకో అరగంట పడుతుందని.

గొప్ప అదృష్టంగా భావించాను నామట్టుకు నేను. ఎంత హాయిగా ఉందా దృశ్యం! ఆవాగుకే కళుజు కట్టించాలని బసప్ప దశాబ్దం నుండీ ఆందోళన చేస్తున్నాడు. అదొక్కటి పూర్తి చేస్తే నా కార్యక్రమం ఐపోయి నట్లే అంటాడు. పైకాలవ తలకరిం దగ్గర కళుజు కడితే ఏడు చెరువులూ ఒకే దమ్ముతో నిండిపోతుందంటాడు. ఆ కట్టుకాల్వ కూడా అలాగే ఉంది. మొదటి చెరువు నిండి మొరవ సాగితే అదే మొరవ రెండో చెరువులో దూకుతుంది. ఇట్లా ఏడు చెరువులూ నిండి ఏరుదాకా సాగుతుంది నేరేళ్ళ వాగులోకి.

బసప్ప ఈఏడు చెరువుల కథను చెప్పినపుడు రైతుల్లో ఎంత గొప్ప వాళ్లుండేవారని అన్పించింది. ఆ కథలో రైతుకు ఏడుగురు కొడుకులు. రైతు బాగా సంపాదించి కొడుకుల్నిఅడుగుతాడు. బంగారాన్నంతా పూడిక వేస్తానంటాడు. వెండినంతా లిచ్చెలు పెడతానంటాడు. కాని ఏడుగురు కొడుకులు ఏడు చెరువులు త్రవ్వించాలని పట్టుబడితే ఆ చెరువులు త్రవ్వించా రని బసప్ప చెబుతుంటే ఆ కథను వినడం ఒక్కసారి కాదు. వందసార్లు ఆ కథను కావ్యంగా వ్రాస్తే కదా నువ్వు అంటూ కవ్వించేవాడాయన.

బాగా చీకటి పడింది. పసిడి గేదంగి మొగ్గలు క్రమబద్ధంగా పంచు కున్న పరిమళంతో ప్రకృతి పులకరిస్తున్నది.

" ఆ మధ్య ఒక విచిత్రం జరిగింది. నా కళ్ళతో చూచి ఆశ్చర్య పడ్డాను అన్నాడు కృష్ణ. కృష్ణకు బసప్పమీద అమితమైన గౌరవం.

" మాకు కందులు ఒక మూట కావలసివచ్చి వెళ్ళాను. నేనూ బసప్ప మాట్లాడుతూ వుండగానే ఒకాయన వచ్చి ఆ వీధిలో కలరా అన్నాడు. ఆమాటతోనే వణుకుతూ కూచున్నాడు. బసప్ప ఉన్నపాళాన

గబగబా వెడుతుంటే అనుకరించలేక పోయాను. అసలు కలరా అంటే చిన్నప్పటినుండీ నాకు అమితమైన భయం అన్నాడు కృష్ణ.

జీపు సరిపడడానికింకా పది నిమిషాలు పట్టేలావుంది. ఆలోగా ఈ కథను వినవచ్చునని కొంత ఆసక్తిని చూపెట్టగానే కృష్ణ అందుకొన్నాడు.

" ఆమనిషికి విరేచనాలూ, సమనాలూ, అలా భుజంపైనే వేసుకొన్నాడు బసప్ప. బండిలో తెచ్చిపెట్టాడు దూర దూరంగా నిల్చున్నారు మనుషులు. అసలు బండితోలే వాడే ఎక్కువగా బెదురుతున్నాడు, నేనూ పదిగజాల కవతలే నిలబడ్డాను. బసప్ప నన్ను మరచాడు. బండి చక చకా వెళ్ళిపోయింది. కలరా పేషంటును తాకడమంటే తెలిసి తెలిసీ చావును కొని తెచ్చుకోవడమే. "

కృష్ణ మాటల్లో ఎంతో యదార్థముంది. పల్లెలో కలరా అంటే ఎంత భయమో చెప్పడానికి వీలు కాదు. కలరా సోకిందని తెలిస్తే చాలు ఆ వీధి వీధీ అమాంతం కాళీ అయిపోతుంది. చివరికా పీనుగనెత్తే వారు కూడా దొరకని ఘట్టాలు బోలెడున్నవి.

అనుకొన్న వేళకంటే ముందుగనే ఆ జీపు సరిపడ్డం అదృష్టం. ఆ దినం ప్రయాణమంతా అలానే గడిచింది. ఎన్నికల్లో ఈ జనాల ధోరణిని పరిశీలిస్తూవుంటే అసలీ దేశంలో ఈ విధానాన్ని అర్థం చేసుకొనే పరిస్థితి యెప్పుడు వస్తుందోననే అనుమానంకూడా ప్రభవిస్తున్నది.

ముద్దకట్టిన చీకటిలో నియంతృత్వం సోకడం జాడలు కన్పిస్తున్నవి. ఆ చీకటిని చీల్చుకొంటూ జీపువెళ్ళి బసప్ప యింటి ముందు ఆగింది.

బసప్ప నవ్వుతూ మమ్మల్ని ఆహ్వానించాడు. వసారాలోనే కూచున్నాము. ఆయన లోపలికివెళ్ళి మంచి నీళ్ళు తెమ్మని కేక పెట్టాడు.

నీళ్ళు తాగుదాం కాని, ఏమైంది రిజల్టు? ఎంత మెజారిటీ? ” అన్నాడు కృష్ణ.

“పోయిందిగా అన్నాడు. నిర్లిప్తంగా బసప్ప.

భూమి ఉన్న పాళాన రెండుగా చీలిపోతున్నట్లు అన్పించింది. బసప్ప అదే పనిగా సాధించి తెచ్చిన విద్యుద్దీపాలా వుళ్ళో దేదీప్యమానంగా వెలుగుతూనే ఉన్నవి. కమ్యూనిటీ హాల్లో రేడియో పాట విన్పిస్తూనే ఉంది.

“నిజంగానే అంటున్నరా ! ” అన్నాడు కృష్ణ

“మీతో సరసమా ! నింజగానే పోయింది. మా వార్డులో మొత్తం ఓట్లు ఎనభై. ఎనభై ఓట్లూ పోలైనాయ్. వాళ్ళకేమో పది ఓట్లు మెజారిటీ” అన్నాడు బసప్ప.

కృష్ణ ఊహించిందలా కాదు. ఆ పోటీ చేసినగంగులప్పకు పదిఓట్లు మాత్రమే రాగలవని బసప్పకు డెభ్భై ఓట్లు ఖచ్చితంగా పడతాయని.

ఈలోగా మంచి నీళ్ళతో పాటు కాఫీ కూడా వచ్చింది. ఎన్నికల్లో ఓడిపోయిన వాతావరణం. ఆయింటిలోనే కన్పించక పోవడం అటుంచి ఎవరి పనిమీద వారున్నట్లు కన్పించింది. “మీరు నీళ్ళు త్రాగండి చెబుతాగా” అంటూ తొందరపెట్టాడు బసప్ప.

ఎంతో నిరుత్సాహంగా ఉన్నా ఆయన వదలడని తెలిసి కాఫీ కూడా త్రాగాము.

“ఆ దినం మీరు బండిలో పేసుకపోయారే కలరా పేషెంటు అతను మీ ఓటరేనా ? ” కృష్ణ అడిగాడు.

“అవును. మా వార్డే” అన్నాడు బసప్ప.

“మీకే ఓటుచేసి ఉంటాడు”అన్నాన్నేను మానవత్వంమీది మమతతో.

“ఆ కుటుంబంలో ఏడు ఓట్లున్నాయి. ఒక్కటీ రాలేదు” అన్నాడు బసప్ప గట్టిగా నవ్వుతూ.

ఆయనెంతగట్టిగా నవ్వాడో అంతకంటే బలంగా నా గుండెలు అదిరి పోయాయి.

రాజకీయాలు చదరంగాలే కావచ్చు. ఆ ఫలితాలను కూడా అతి తేలిక గానూ భావించవచ్చు. ఒక పరిశోధనగానూ తీసుకోవచ్చు. కానీ కృషి విఫలమైనపుడు కడుపు తరుక్కుపోతుంది. హృదయంలో బడబాలనంవంటి మహాభీషణమైన అతితీవ్రమైన ఆవేదన ప్రభవిస్తుంది. శారీరకంగా దుర్బలంగానున్న నా వంటి వారికది అసహనంగా పరిణమించడం ఆశ్చర్యం కాదు.

తలనొప్పిగా ఉంటే కాఫీ త్రాగడం నాకు అలవాటే. కాఫీ త్రాగందే వచ్చిన తలనొప్పికి ఔషధం ఏముంటుంది? "మీరు చాలా పొరబాటు చేశారు. ఇంకెప్పుడూ ఏనాటికీ ఏ ఎన్నికలలోను పోటీచెయ్యకండి. కాలం మారింది." అన్నాను. మహా ఆవేదనలో అంతకంటే ఏం చెప్పాలో తెలియక.

బసప్ప విరగబడి నవ్వుతూ కాస్త స్వరాన్నిపెంచి యిలా అన్నాడు. "మా వార్డులో నన్ను ఓడించడానికి కెంత ఖర్చయిందను కొంట్టున్నారు?" నాకు వెంటనే జవాబు స్ఫురించలేదు. "వెయ్యో రెండు వేలో ఉంటుంది" అన్నాడు కృష్ణ.

"కాదు వారు కొన్న ఓట్లు ముప్పైఐదు ఓటుకు వందచొప్పున మూడు వేల ఐదు వందలిచ్చారు" అన్నాడు బసప్ప.

వింటూనేవున్న నావైపు చూచి బసప్ప మళ్ళీ అన్నాడు.

"మా పంచాయతీలో పదకొండు వార్డులున్నాయి గదా! పదకొండు వార్డుల్లోనూ నన్ను ఓడించాలంటే కనీసం నలభై వేలు కావాలి"

నిజమే పదేమ వందలు తక్కువైనా నలభై వేలు కావలసివస్తుందన డంలో ఆశ్చర్యం లేదు.

" లెక్క వేసుకోండి. మా సమితిలో పంచాయతీలు డెబ్బై ఆరు న్నాయి, " అన్నాడు బసప్ప.

లెక్క వెయ్యడానికి కొన్ని క్షణాలు పట్టింది. ముప్పై లక్షల పై చిలుకు.

" వచ్చే ఎన్నికల్లో నేనే పోటీ చేస్తే ముప్పై లక్షలు లేనిదే నన్ను ఓడించడం అసాధ్యమండీ " దృఢంగా అన్నాడు బసప్ప.

ఆమాటల్లో ప్రస్ఫుటించిన విశ్వాసాన్ని గుర్తించిన నాకు అమితాశ్చర్యం కల్గడం అలా ఉండగా అప్పటికప్పుడే తలనొప్పి కూడా తగ్గిపోయింది.

కేవలం పచ్చ నోట్లతోనే ఈ దేశాన్ని పరిపాలించే ప్రతినిధులు భవిష్యత్తులో ఉండగలదన్న నా ఊహ కృత్రిమంగా కల్పించుకొన్న అనుమానమేనని అన్పించింది.

మా జీపు స్టార్టయింది. కానీ అప్పుడే బయలుదేరిన పంచాయతీ అధ్యక్షుని ఊరేగింపును చీల్చుకొని రావడానికి కొంత ఆలస్యమైంది.

పెద్ద లారీ పైన బ్రహ్మాండమైన ప్రభను జోడించారు. ఆ మధ్య కూచున్నాడు అధ్యక్షుడు. అతని ముఖంలోమాత్రం నెత్తురు చుక్క వున్న పోలిక కన్పించలేదు సరిగదా కనీసం ఐదారుమందినైనా చంపిన హంతకుని భయాందోళనలు అతనిలో తొంగి తొంగి చూస్తున్నవి.

దారిపొడుగునా బసప్ప అన్నమాటలే చెవుల్లో గింగురుమంటున్నాయి. " వచ్చే ఎన్నికల్లో ముప్పై లక్షలైనా లేనిదే నన్ను ఓడించడం అసాధ్యమండీ.

బసప్ప అన్నట్లు ఓటుకు వంద రూపాయలిస్తే ముప్పై లక్షలు. పది రూపాయలిచ్చినా మూడు లక్షలు.

అసలు ఎన్నికల్లో ఓడిపోతే మళ్ళీ ఆ జోలికే పోకపోవడం బుద్ధిమంతుల లక్షణం అని రాజకీయవాదులే అంటూ ఉండడం విన్నాను. మళ్ళీ వారే పోటీచెయ్యడం కూడా చూశాను, కానీ బసప్ప రాజకీయవాది కాడు. అతనిలో ఒక్కపట్టుదల మాత్రంవుంది. పరిసరాలలోని ప్రజలకు అవసరమైన అన్ని సదుపాయాలనూ సమకూర్చాలని. అలాంటి వాడు ఎన్నికల్లో పోటీ చెయ్యడమే పొరబాటేమోనని భావించేవాడిని కానీ అసలు పోటీ చేయదగిన అర్హత వారికే ఉందన్న సత్యాన్ని మాత్రం కాదనే సాహసం లేదు.

“ బసప్ప అంటాడు. కానీ ఈరోజుల్లో డబ్బున్న వాడిదే గెలుపు ” అన్నాడు కృష్ణ. నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ అతడు కూడా అదే సమస్యను ఆలోచిస్తున్నాడని తెలుస్తు.

ఉదయంనుండీ మా మాటల్ని ఎంతో జాగ్రత్తగా వింటున్నట్లుంది డ్రైవరు. ఒక్కసారికూడా నోరుమెదపలేదు.

“ ఓటువెల పెరిగింది సార్. నాకు తెలిసి పావలాకుకూడా యిచ్చారు, వందనుండి వెయ్యిదాకాకూడా ఉంది. ఇక అధ్యక్షుల ఓట్లు పది నుండి లక్ష దాకా పెరిగినా పెరగవచ్చు. ఇకమీద ఎంతకోటీశ్వరుడైనా ఓట్లు కొనలేడు సార్. ఈమారు బసప్ప నిలిస్తే ఎందుకు గెలవడు చెప్పండి ” అన్నాడు.

అందరూ ఆలోచనలోపడ్డాము. డ్రైవరు మళ్ళీ అన్నాడు.

“ నా ఓటుమాత్రం బసప్పకే. నా యెత్తు డబ్బిచ్చినా బసప్పకే ” ఆమాటతోపాటు జీపు వేగంకూడా హెచ్చింది.